# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 10-03-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **అత్యుత్తమ భద్రత ప్రమాణాలతో పట్టాదారు పాసుపుస్తకాలు రైతులకు అందజేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**

2. **ఆధునిక సాంకేతికతతో పోలీసుశాఖ ప్రజలకు మరింత మెరుగైన సేవలందించాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.**

3. **మహిళల ఆర్థిక సాధికారతకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర పేదరిక నిర్మూలనా శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు.**

4. **ఆంధ్రప్రదేశ్ లో ప్రతి ఒక్కరికి కార్పొరేట్ వైద్యాన్ని అందించేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వెల్లడించారు.**

5. **ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కార్యక్రమంలో భాగంగా "యువ సంగమ్" ఆరో దశ కోసం ఆన్‌లైన్ నమోదును కేంద్ర విద్యామంత్రిత్వ శాఖ ప్రారంభించింది.**

==========================

భూసమస్యలు తలెత్తకుండా అత్యుత్తమ భద్రత ప్రమాణాలతో పట్టాదారు పాసుపుస్తకాలు రైతులకు అందజేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. నంద్యాల జిల్లా డోన్ మండలం కొత్తబురుజు గ్రామంలో నిర్వహించిన 'మీ భూమి–మీ హక్కు' గ్రామసభలో పాల్గొని పట్టాదారు పాస్ పుస్తకాలను లబ్దిదారులకు నిన్న అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, భవిష్యత్తులో భూముల రిజిస్ట్రేషన్ కూడా అరగంటలో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు ఆధునిక సాంకేతికతను వ్యవసాయంలో వినియోగించాలని ముఖ్యమంత్రి పేర్కొంటూ,

వాయిస్ 35 సెకన్లు

---------------------------

ఆధునిక సాంకేతికతతో పోలీసుశాఖ ప్రజలకు మరింత మెరుగైన సేవలందించాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ లో నిర్వహించిన పోలీసు అధికారుల రీట్రీట్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రమైనా.. దేశమైనా అభివృద్ధి చెందాలంటే శాంతి భద్రతలు ముఖ్యమని తెలిపారు. కొత్త కొత్త మార్గాల్లో నేరాలు జరుగుతున్నాయని, కొత్త

సవాళ్లను ఎదుర్కోవాలంటే. పోలీసు అధికారులు నూతన అంశాలను అందిపుచ్చుకోవాలని ముఖ్యమంత్రి సూచిస్తూ,

వాయిస్..30.. సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని విశాఖపట్నంలో నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో దక్షిణాది రాష్ట్రాల "ప్రాంతీయ ఉత్తమ పద్ధతుల సదస్సు"ను నీతి ఆయోగ్ అదనపు కార్యదర్శి, రోహిత్ కుమార్ నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ , వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ఆకాంక్షత్మక జిల్లాల కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. అభివృద్ధిలో జిల్లాల మధ్య ఆరోగ్యకరమైన పోటీ, సమన్వయంతో తక్కువ సమయంలో మంచి ఫలితాలు సాధ్యమవుతాయని చెప్పారు. ఈ సదస్సులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాలతో పాటు అండమాన్ నికోబార్ కేంద్రపాలిత ప్రాంతానికి చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

---------------------------

మహిళల ఆర్థిక సాధికారతకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర పేదరిక నిర్మూలనా శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. విజయనగరంలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి నిన్న మాట్లాడుతూ.. 'హ్యాండ్ హోల్డింగ్ సిస్టమ్' ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలకు అవసరమైన మార్గదర్శకత్వం అందిస్తున్నామని చెప్పారు వ్యవసాయ ఆధారిత పరిశ్రమల్లో మహిళలకు అవసరమైన నైపుణ్యాలను అందించడం, విలువ ఆధారిత ఉత్పత్తులు తయారీలో శిక్షణ ఇవ్వడం ద్వారా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేస్తున్నామని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ 30..సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని ఏలూరు జిల్లా నూజివీడులో 2 కోట్ల 20 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి నిన్న శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నూజివీడులో ఇప్పటికే సుమారు 16 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారం కోసం బైపాస్ రోడ్డు నిర్మాణానికి భూసేకరణ పూర్తయిందని, త్వరలో పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. అలాగే ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పేదల వైద్యానికి 11 కోట్ల రూపాయలకు పైగా ఆర్థిక సహాయం అందించామని తెలిపారు. నియోజకవర్గంలో వివిధ వర్గాలకు కమ్యూనిటీ హాల్లు, కళ్యాణ మండపాలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పార్థసారథి తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో ప్రతి ఒక్కరికి కార్పొరేట్ వైద్యాన్ని అందించేలా చర్యలు తీసుకుంటున్నామని చిత్తూరు జిల్లా ఇన్చార్జి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. చిత్తూరులోని జిల్లా ప్రభుత్వాసుపత్రిలో అత్యాధునిక సదుపాయాలతో ఏర్పాటు చేసిన అత్యవసర చికిత్స విభాగం, ట్రామా కేర్ యూనిట్ ను మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ, అత్యవసర సమయాల్లో రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు

వీలుగా ఈ సదుపాయాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

వాయిస్ ..25.. సెకన్లు

---

ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ –ఈబీఎస్‌బీ కార్యక్రమంలో భాగంగా "యువ సంగమ్" ఆరో దశ కోసం ఆన్‌లైన్ నమోదును కేంద్ర విద్యామంత్రిత్వ శాఖ ప్రారంభించింది. దేశంలోని వివిధ రాష్ట్రాల యువతకు వివిధ ప్రాంతాల పరస్పర అవగాహన పెంపొందించడం లక్ష్యంగా యువ సంగమ్ నిర్వహిస్తున్నారు. 18 నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్సు గల ఉన్నత విద్యాసంస్థల విద్యార్థులు, ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌వైకేఎస్ వాలంటీర్లు ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ebsb.aicte-india.org అధికారిక పోర్టల్‌లో, లేదా ekbharat.gov.inలో దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంపికైన యువతకు అయిదు నుంచి ఏడు రోజులపాటు విద్యా, సాంస్కృతిక యాత్రలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ లోని తిరుపతి భారతీయ సాంకేతిక విజ్ఞాన సంస్థ, మహారాష్ట్రలోని పూణే ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ సంస్థతో జతగా కార్యక్రమాలు నిర్వహించనున్నాయి.

---

యువతకు ఆధునిక నైపుణ్యాలు పెంచి ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ కార్మిక, ఉపాధి శాఖ మంత్రి జీ. వివేక్ వెంకటస్వామి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ 99 రోజుల ప్రజా పాలన – – ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా మల్లేపల్లి ప్రభుత్వ ఐటీఐలోని అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ –ATCలో నూతన స్వల్పకాలిక కోర్సులను మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తోందన్నారు. ఏటీసీలు, ఐటీఐలు భవిష్యత్ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలతో కూడిన శిక్షణ పొందిన నిపుణులను తయారు చేస్తున్నాయని వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు.

---

కోస్తా తమిళనాడు, కోస్తా ఆంధ్రప్రదేశ్ మీదుగా సముద్ర మట్టానికి 0.9 కిలో మీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో పొడి వాతావరణం ఏర్పడే అవకాశముందని, ఒకటి రెండు చోట్ల పొగమంచు కురిసే అవకాశముందని తెలిపింది. రాయలసీమలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2, 3 డిగ్రీల సెంటిగ్రేడ్ అధికంగా నమోదయ్యే అవకాశముందని పేర్కొంది.

తెలంగాణా వ్యాప్తంగా పొడి వాతావరణం ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. పలు ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2,3 డిగ్రీల సెంటిగ్రేడ్ అధికంగా నమోదయ్యే అవకాశముందని పేర్కొంది.

====================